రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, డిసెంబర్ 16 : జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సీఎం కప్-2024 జిల్లా స్థాయిల పోటీలను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీ వరకు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, కౌన్సిలర్ వనితారాంమోహన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, పలు అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ, డిసెంబర్ 16 : బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు, రెజ్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలపై ఆడిట్

నస్రుల్లాబాద్, డిసెంబర్ 16 : బీర్కూర్ మండలంలోని ఐకేపీ కార్యాలయంలో జిల్లా అధికారి రాంచందర్‌గౌడ్ గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవీలపై సోమవారం ఆడిట్ నిర్వహించారు. మండలంలో ఉన్న 15 గ్రామ సంఘాలకు సంబంధించిన అప్పులు, రుణాల మంజూరు, వసూళ్లు, ఆదాయ వ్యయాలు, ఖర్చులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 24 నుంచి సెప్టెంబర్ 24 వరకు గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఐకేపీ ఏపీఎం గంగాధర్, సీసీలు మహేందర్, నాగలక్ష్మి, పండరి, భూమయ్య, వీవోఏలు ఉన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 54 ఫిర్యాదులు

కామారెడ్డి,డిసెంబర్ 16: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 54 ఫిర్యాధులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజంపేటలో ఒక ఫిర్యాదు

రాజంపేట్, డిసెంబర్ 16 : రాజంపేట లోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించినట్లు నయాబ్ తహసీల్దార్ సంతోషి తెలిపారు. రెవెన్యూకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందని తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

'గురుకులాల బాట'తోనే మెస్ చార్జీల పెంపు

నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 16 : బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే గురుకుల పాఠశాలల్లో మెస్ చార్జీలను పెంచారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలు, వసతి గృహాలు, కేజీబీవీల్లో సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ గురుకులాల బాట చేపట్టిందన్నారు. దీంతో ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిందని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహులుగౌడ్, సాయిలు, వెంకట్, శేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్ట్

మద్నూర్‌లో దరాస్ సురేశ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

మాచారెడ్డి/మద్నూర్, డిసెంబర్ 16 : మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, కాకులగుట్ట తండా సర్పంచులు హంజీనాయక్, హేమ్లానాయక్‌ను పోలీసులు సోమవారం వేకువ జామున అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌ను ముట్టడించడానికి వెళ్తున్న మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచుల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్నూర్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, స్థానిక తాజా మాజీ సర్పంచు దరాస్ సురేశ్‌ను పోలీసులు ముందస్తు అరెస్ట్‌చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 16 : మండలంలోని ఆయా గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్, గురుకుల పాఠశాలల విద్యార్థులకు నెమ్లి గ్రామంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో వారధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు భక్తశ్రీసేవా కుమార్ మాట్లాడుతూ.. పిల్లలు జీవితంలో ఎలా ఉండాలి, గురువులు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి, చదువుతోపాటు సంస్కారం ఎలా ఉండాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్య, వైద్యం, పర్యావరణ రంగాలను ఎంచుకొని సమాజానికి మరిన్ని సేవలు అందించాలనేది కార్యక్రమం ఉద్యేశమని అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోపాల్‌సింగ్ ఠాకూర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో విజయ్ దివస్

నస్రుల్లాబాద్, డిసెంబర్ 16 : బీర్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. 1971 యుద్ధంలో పోరాడి చారిత్రాత్మకంగా విజయం సాధించిన భారత జవాన్ల సేవలను స్మరిస్తూ అమరులైన సైనికులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించి మౌనం పాటించారు.

22న రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్ష

కామారెడ్డి, డిసెంబర్ 16 : శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీన నిర్వహించాల్సిన రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షను ఈ నెల 22వ తేదీకి మార్చినట్లు గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను రంగారెడ్డి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పరీక్షకు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, సంబంధిత టీచర్లు, తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.

పరిసరాలను శుభ్రం చేయించిన అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మాచారెడ్డి, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల్లోని పరిసరాలను అధికారులు శుభ్రం చేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'అపరిశుభ్రం.. అస్తవ్యస్తం' అనే శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో గోపీబాబు, ఎంపీవో నాగరాజు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పిచ్చిమొక్కలు తొలగించడంతో శుభ్రమైన మండల పరిషత్ కార్యాలయ ఆవరణ

తహసీల్ కార్యాలయ ఆవరణ..

'సైబర్' బాధితులకు నగదు అందజేత

కామారెడ్డి, డిసెంబర్ 16 : లోక్ అదాలత్ ద్వారా సైబర్ బాధితులు పోగొట్టుకున్న నగదును తిరిగి అందజేసినట్లు ఎస్పీ సింధూశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీన లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో సైబర్ మోసాలకు గురైన 64 మంది బాధితులు రూ.9,14,599 తిరిగి పొందేలా కోర్టు ద్వారా వివిధ బ్యాంక్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో కూడా 62 కేసుల్లో రూ.12 లక్షలు బాధితులకు తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా క్రెడిట్, డెబిట్ కార్డు, కేవైసీ అప్‌డేషన్, పాన్ కార్డ్ లింకేజీ, కార్డ్ రీప్లేస్‌మెంట్ తదితర మోసాలకు గురవుతున్నారని వెల్లడించారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఏటీఎం పిన్ నంబర్, సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీలను ఎవరికి చెప్పొద్దని సూచించారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

మాచారెడ్డి, డిసెంబర్ 16 : మండలంలోని గజ్యానాయక్‌తండా గ్రామానికి చెందిన లావుడ్యా లాలీ గతంలో సారా తయారు చేసి విక్రయిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘించి సారా తయారు చేసి విక్రయిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ శ్వేత ఎదుట సోమవారం ప్రవేశపెట్టగా రూ.పది వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

వసతి గృహాలను సందర్శించిన ఎంపీడీవో

ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్యూరిఫయర్ పరిశీలిస్తున్న ఎంపీడీవో

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

లింగంపేట, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల్లో పని చేయని ప్యూరిఫయర్లను ఎంపీడీవో నరేశ్ సోమవారం పరిశీలించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'వసతి గృహాల్లో పని చేయని ప్యూరిఫయర్లు' అనే శీర్షికన సోమవారం వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా రెండు వసతి గృహాలను సందర్శించి ప్యూరిఫయర్లను పరిశీలించారు. వసతి గృహాల వార్డెన్లను వివరాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహాల్లో పని చేయని ప్యూరిఫయర్లపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించి త్వరలో మరమ్మతులు చేయించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో వెంట ఆయా వసతి గృహాల వార్డెన్లు కృష్ణ, రాజేశ్వర్ ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంఈవో

ఎల్లారెడ్డి కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 16: పట్టణంలోని కేజీబీవీని ఎంఈవో వెంకటేశం సోమవారం తనిఖీ చేశారు. కేజీబీవీలో నలుగురు టీచర్లు విధుల్లో ఉండి పాఠ్యాంశాలు బోధిస్తున్నారని ఆయన తెలిపారు. మిగతా టీచర్లం దరూ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సమ్మెలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ తరగతులు అసంపూర్తిగా కొనసాగుతున్నందున మిగతా సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయనతో పాటు కేజీవీబీ టీచర్ అంజన ఉన్నారు.

'ప్రజావాణి'కి ఐదుగురు అధికారులే హాజరు

జుక్కల్‌లో ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన అధికారులు

బిచ్కుంద, డిసెంబర్ 16 : ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తుంటే జుక్కల్ మండలంలో పని చేసే అధికారులు మాత్రం అవేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించినప్పటికీ సోమవారం జుక్కల్ తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, వ్యవసాయ అధికారిణి, ఐకేపీ అధికారి మాత్రమే హాజరయ్యారు. కలెక్టర్ ఆదేశాలను అధికారులు బేఖాతరు చేస్తున్నారు. మారుమూల మండలంలో ప్రజావాణికి హాజరుకాని అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. ఐదు శాఖల్లోనే సమస్యలు ఉన్నాయా.. మిగతా శాఖల్లో సమస్యలు లేవా.. అని ప్రజలు గుసగుస లాడుతున్నారు. ప్రజావాణికి దరఖాస్తు ఇవ్వడానికి వచ్చినవారు అధికారులు లేకపోవడంతో వెనుదిరిగి పోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజావాణికి హాజరై తమ సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాలిబాటలు వదిలి నాటు వేయాలి

రాఘవపల్లిలో యాసంగి నాట్లపై మహిళలకు వివరిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్‌కుమార్

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 16: యాసంగిలో వేసుకొనే వరి పంటల్లో..కాలి బాటలు వదిలి నాట్లు వేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్‌కుమార్ సూచించారు. మండలంలోని రాఘవపల్లి గ్రామ శివారులో సోమవారం వేస్తున్న వరినాట్లను ఆయన సందర్శించారు. రైతులు నాట్లు వేసే సమయంలో కాలిబాటలు ఉత్తరం, దక్షిణం వేపు ఉంటే గంగకు వేసుకోవాలన్నారు. ఈ విధంగా నాట్లు వేసుకోవడం వల్ల ఈశాన్య రుతుపవనాల వల్ల వీచే గాలులు, వర్షాల వల్ల పంటలకు కలిగే నష్టాలు తగ్గించవచ్చునన్నారు. గంగకు కాలి బాటలు వేయడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు రాకుండా తట్టుకుంటుందన్నారు. దీంతో గంటలో పిలకలు పెట్టే స్థాయి ఎక్కువ ఉంటుందన్నారు. నాట్లు వేసే సమయంలో చదరపు మీటరు విస్తీర్ణంలో 44మొక్కలు ఉండేలా నాటుకోవాలన్నారు. దీంతో దిగుబడి పెరుగుతుందన్నారు. వారివెంట గ్రామ రైతులు ఉన్నారు.

'మాట తప్పిన ముఖ్యమంత్రికి బుద్ధి చెబుతాం'

నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 16: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి నేడు మాట తప్పు తున్నాడనీ..మాట తప్పిన ఆయనకు తగిన బుద్ధి చెబుతామని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మంథాని సామ్యెల్ మాదిగ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను ఇప్పుడు మాల సంపన్నుల కోసం తప్పుతున్నాడని, ఆయనకు తగిన బుద్ధి చెప్పక తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ మాదిగ, మండల అధ్యక్షుడు సాయిలు, సీనియర్ నాయకులు కంతి పద్మారావు, కుంటోళ్ల యాదయ్య, బట్టు వెంకటరాములు, మండల నాయకులు లవణ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

గృహాలు లేని వారిని గుర్తించాలి

లింగంపేట, డిసెంబర్16: ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక సర్వేలో నివాస గృహాలు లేని వారిని గుర్తించాలని ఎంపీడీవో నరేశ్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. నివాస గృహాలు లేని వారికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రవణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, గ్రామ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 16: గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని హెచ్ఆర్‌సీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఖలీలుల్లా అన్నారు. మండలకేంద్రంలో సోమవారం మండల మానవ హక్కుల కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మానవుడికి ఉన్న హక్కులను వివరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ పోటీలకు అన్నాసాగర్‌తండా వాసి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 16: మండలంలోని అన్నాసాగర్ జీపీ పరిధిలోని అన్నాసాగర్ తండాకు చెందిన ధరావత్ శేఖర్ నేషనల్స్‌కు ఎంపికయ్యాడు. ఈనెల 13న నిర్వహించిన సౌత్‌జోన్ ఇంటర్ కళాశాల వాలీబాల్ టోర్నమెంట్‌లో కెప్టెన్‌గా ఉన్న శేఖర్ జట్టు విజయం సాధించడంతో నేషనల్స్‌కి సెలెక్ట్ అయ్యాడు.ఈ నెల 18వ తేదీన కేరళలో నిర్వహించనున్న నేషనల్ సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో శేఖర్ అడనున్నాడు.

కుంగ్‌ఫూలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి

లింగంపేట, డిసెంబర్16: మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన షేక్ అక్బరుద్దీన్ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు గ్రామ మాజీ సర్పంచ్ దొడ్లె సురేందర్‌గౌడ్ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కుంగ్‌ఫూ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడని, అలాగే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు మరో గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. అక్బరుద్దీన్‌కు నిర్వాహకుడు కంఠేశ్వర్ మెడల్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

మున్నూరు కాపులు ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకోవాలి

బిచ్కుంద, డిసెంబర్ 16: మున్నూరు కాపులు సమాజంలో ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకోవాలని ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో బండయప్ప ఫంక్షన్ హాలులో సోమవారం మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాసుల బాలరాజ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ మున్నూరు కాపుల జీవన ఆధారం వ్యవసాయమని, విద్యా, రాజకీయ, ఆర్థికంగా ఎదగాలని, సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న జిల్లా మున్నూరు కాపు అధ్యక్షుడిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు అంజయ్య, ఉగ్గే శ్రీనివాస్, బండివార్ విజయ్, జయప్రదాప్, అస్పత్ వార్ వినోద్, గడ్డం అరవిం ద్, సాయిని అశోక్, సాహేబ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

గాంధారి, డిసెంబర్ 16: కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాంపూర్‌గడ్డలో ఆదివారం చోటు చేసుకుంది. గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గడ్డకు చెందిన సంపంగి పోచయ్య (60) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎక్కడ వైద్యం చేయించుకున్నా, ఎన్ని మందులు వాడినా నొప్పి తగ్గకపోవడంతో ఆదివారం సాయంత్రం గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 11 గంటలకు మృతి చెదాడు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసున నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదాంలో దొంగతనం.. కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 16: ఎలక్ట్రిసిటీ సామగ్రి ఉంచే గోదాంలో జరిగిన దొంగతనంపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఎండి ఫారూక్ అహ్మద్ ఎనిమిదేండ్లుగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్‌పై ట్రాన్స్‌ఫార్మర్లను బిగించే పనులు చేసేవాడు. దీనికి సంబంధించిన వస్తువులను ఇంటి ముందు ఉన్న గోదాంలో ఉంచేవాడు. ఈనెల 14న రోజూలాగే గోదాంకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. రెండు రోజుల తర్వాత 16న ఉదయం గోదాంకు వెళ్లి చూడగా తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. గోదాంలో దొంగతనం జరిగిందని గ్రహించిన ఫారూక్ పరిశీలించగా రూ.50వేల విలువగల సామగ్రి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫారూక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్టు వద్ద యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రాజెక్టుపై యువకుడు వినయ్‌తేజతో పోలీసులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 16: పోచారం ప్రాజెక్టులో దూకి ప్రాణం తీసుకోవాలనుకున్న యువకుడి ప్రాణాలను పోలీసులు కాపాడిన ఘటన సోమవారం చోటు చేసుకొన్నది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ సుచిత్రకు చెందిన అనపోజు వినయ్‌తేజ (28) కుటుంబసభ్యులతో గొడవ పడి, జీవితంపై విరక్తి చెంది సోమవారం పోచారం ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించాడు. చివరి సారి తన తమ్ముడికి ఫోన్ చేసి, తాను పోచారం ప్రాజెక్టులో దూకి చనిపోతున్నట్లు తెలపడంతో.. వారు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కానిస్టేబుల్ చంద్రయ్య, హోంగార్డ్ కాశయ్య వెళ్లి చూడగా ప్రాజెక్టుపై అంచున దూకేందుకు యత్నిస్తున్న యువకుడిని పట్టుకొన్నారు. విషయాన్ని యువకుడి తండ్రి గణపతికి సమాచారం ఇచ్చారు. యువకుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని, సమయానికి స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ చంద్రయ్య, హోంగార్డు కాశయ్యను ఎస్సై మల్లారెడ్డి అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామారెడ్డి, డిసెంబర్16: మండలంలోని రెడ్డిపేట్ గ్రామంలో సోమవారం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాచర్ల నర్సింహులు కుటుంబానికి గ్రామానికి చెందిన రైజింగ్ స్టార్ యూత్ సభ్యులు మూడు వేల రూపాయల నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు.